క్లుప్తంగా

డీఐజీని కలిసిన దీపిక



డీఐజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి మంగళవారం అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హిందూపురం నియోజకవర్గంలో నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, దొంగతనాలు, భూ కబ్జాలు, మట్కా, గ్యాంబ్లింగ్, అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడానికి కృషి చేయాలన్నారు. డీఐజీ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

బొక్సంపల్లి వద్ద సినిమా షూటింగ్



బొక్సంపల్లి వద్ద షూటింగ్ ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని బొక్సంపల్లి సమీపంలో కన్నడ సినిమా షూటింగ్ నిర్వహించడానికి మంగళవారం సెట్ ఏర్పాటు చేస్తున్నారు. 11 రోజుల పాటు షూటింగ్ జరుగుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు. గురువారం కన్నడ సినీ హీరో శివరాజ్‌కుమార్ షూటింగ్‌లో పాల్గొంటారన్నారు.

కురుబలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

హిందూపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల పైచిలుకు జనాభా ఉన్నా కురుబలకు అన్ని రాజకీయ పార్టీలు టికెట్ల కేటాయింపుల్లో 10 శాతం అవకాశం కల్పించాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక కురుబ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ చలపతి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కర్ణాటక ఎన్నికల్లో గెలుపొందిన కురుబ ఎమ్మెల్యేలకు హిందూపురంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హిందూపురం నుంచి రాష్ట్ర కురుబ సంఘం కమిటీలో రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణగౌడ్, ఈసీ మెంబర్‌గా ముదిరెడ్డిపల్లి రామచంద్రను నియమించినట్లు చెప్పారు.

సింగిల్‌విండో చైర్మన్ల నియామకం





దివాకర్‌రెడ్డి (చిలమత్తూరు) హనుమంతరెడ్డి (కోడూరు) అమరనాథ్ (సోమఘట్ట)

చిలమత్తూరు: మండలంలో మూడు చోట్ల పీఏసీ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిలమత్తూరు చైర్మన్‌గా పి.దివాకర్‌రెడ్డి, సభ్యులుగా నవాబ్‌వలీఖాన్, నాగేనాయక్ ను నియమించారు. కోడూరుకు చైర్మన్‌గా ఆర్.హనుమంతరెడ్డి, సభ్యులుగా జింక సజ్జప్ప, వెంకటప్ప, సోమఘట్టకు చైర్మన్‌గా ఎ.అమరనాథ్, సభ్యులుగా లక్ష్మిరెడ్డి, మాల ఆదినారాయణలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తమ ఎంపికకు సహకరించిన నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, ఎంపీపీ పురుషోత్తమరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

మహాలక్ష్మి నమోస్తుతే !



అలంకరణలో మహాలక్ష్మిదేవి

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రొళ్ల పరిసరాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సుబ్రహ్మణ్యునికి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

హిందూపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని సప్తఫణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి విశేష పూజలను నిర్వహించారు. అధిక శ్రావణశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

8న మండల మీట్

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 8న ఎంపీపీ అధ్యక్షతన మండల మీట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేష్ కృష్ణ తెలిపారు. వివిధ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం పరుగు

● ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



రెడ్డిపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమం పరవళ్లు తొక్కుతుండగా.. ప్రగతి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించడంతో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 600పైగా చిలుక హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రస్తుతం ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు గ్రామాల్లో బాదుడే బాదుడు అంటూ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలో నీరు–చెట్టు, మరుగుదొడ్లు, ఉపాధి హామీ పథకం పేరుతో కోట్లాది రుపాయాల ప్రజాధనాన్ని దోచుకోవటం నిజం కాదా? అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి..తనవారికే న్యాయం చేసిన చంద్రబాబుకు నేడు వైఎస్ జగన్‌ని విమర్శించే హక్కు లేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలను చేస్తున్నట్లు దుయ్యబట్టారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

రెడ్డిపల్లి గ్రామానికి చెందిన జనార్దన్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే శంకరనారాయణ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామంజి, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కురుబ రామాంజినమ్మ, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, ముఖ్య నాయకులు ఎస్ నారాయణరెడ్డి, రాజారెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, ఉజ్జినప్ప, మైలారప్ప తదితరులు పాల్గొన్నారు.

సవితమ్మా.. నీచ రాజకీయాలు మానుకో



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



టీడీపీ నాయకులు నిలబడి ఉన్నచోట మాత్రమే పంట దెబ్బతిన్న దృశ్యం (ఫైల్)

సోమందేపల్లి: రాజకీయ లబ్ధి కోసం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ నీచ రాజకీయాలకు పాల్పడుతుండటం హేయమని వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం విమర్శించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేణుకా నగర్ వద్ద టీడీపీ నాయకుడు వెంకటేశులుకు చెందిన మొక్కజొన్న పంటను వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వంసం చేశారని ఆరోపించడం తగదన్నారు. టీడీపీలో సవితమ్మకు ప్రాధాన్యత తగ్గడంతో కేవలం రాజకీయ లబ్ధి కోసమే వైఎస్సార్ సీపీతో పాటు ఎమ్మెల్యే శంకరనారాయణపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకుడు వెంకటేశులుకు మరో వ్యక్తి విభేదాలున్నాయని, ఈ నేపథ్యంలో నాలుగు సెంట్లలో పంట ధ్వంసమైందన్నారు. పోలీసులు కూడా పంటను పరిశీలించి బాధితుడు వాంగ్మూలం మేరకు ఆకతాయిలు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడి ఉంటారని చెబుతున్నారన్నారు. అయితే వైఎస్సార్ సీపీని చెడు చేసేందుకు మీడియాలో టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యాక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇమామ్‌వలి, అమర్, నాగరాజురావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు సెంట్లలో నష్టం

టీడీపీ నాయకుడు వెంకటేశులుకు చెందిన మొక్కజొన్న పంట నాలుగు సెంట్లలోనే దెబ్బతినిందని ఎస్‌ఐ విజయ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. బాధిత రైతు కూడా వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేదని అధికారులు తెలిపారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

అమరాపురం: దోమల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రజలు అవగాహన కల్పించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన, పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పీఓలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

యువతి అదృశ్యం

పరిగి: మండలంలోని హొన్నంపల్లి పంచాయతీ పరిధిలోని జంగాలపల్లికి చెందిన హిమబిందు (18) అనే యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఘటనపై తల్లి సవిత ఫిర్యాదు చేశారన్నారు. గత సోమవారం ఉదయం బయటకు వెళ్తానని ఇంట్లోని కుటుంబ సభ్యులకు చెప్పి యువతి తిరిగి ఇంటికి వెళ్లలేదన్నారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పావగడ: ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాలు కాపాడుకోవాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ప్రజలకు హితవు పలికారు. స్థానిక స్వామి వివేకానంద గ్రామీణ సంఘటిత ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో పాటు పెద్ద ఎత్తున వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టురూ ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం 300 మంది విద్యార్థులకు జెడ్పీటీసీ శ్రీరాములు డైరీలను పంపిణీ చేశారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం డైరీలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

గుండెపోటుతో అటెండర్ మృతి



శామ్యూల్ (ఫైల్)

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ల్యాబ్ అటెండర్‌గా పని చేస్తున్న శామ్యూల్ (55) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి సంతాప సూచకంగా కళాశాలకు సెలవు ప్రకటించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు.

పౌష్టికాహార లోపంతోనే అనారోగ్యం

పరిగి: నిత్యం తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు తప్పక కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార అవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రోజూ ఆకుకూరలు, కూరగాయలు తదితర పౌష్టికాహారంతో ఉన్న ఆహారాన్ని తినాలన్నారు. ఈ సందర్భంగా రక్తహీనత– నివారణోపాయాలు అన్న అంశంపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన, స్వరూపరెడ్డి, సురేష్, రూబి, సీహెచ్‌ఓ వన్నప్ప, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత

మడకశిరరూరల్: ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు తెలిపారు. మొక్కల పెంపకాన్ని పరిశీలించి రైతులకు సుచనలు, సలహాలను అందిస్తున్నామని తెలిపారు. మండలంలో 190 ఎకరాల్లో 90 మంది రైతుల పొలాల్లో మొక్కల పెంపకం చేపట్టారన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



అమరాపురం: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న సుబ్బమ్మ ఇంటి ఆవరణలో బ్రహ్మ కమలాలు మంగళవారం రాత్రి విరబూశాయి. దీంతో మహిళలు బ్రహ్మ కమలాల ఎదుట దీపం వెలిగించి పూజలు చేశారు.

ఉపాధ్యాయులను నియమించండి

పావగడ: తాలూకాలోని ఆంధ్ర సరిహద్దుకు చెందిన మద్దె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలంటూ గ్రామస్తులు నిరసన తెలిపారు. మంగళవారం పాఠశాలకు తాళం వేసి ఆందోళన నిర్వహించారు.

ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడికి సన్మానం

పెనుకొండ: జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన హనుమంతరెడ్డి, కోశాధికారిగా ఎన్నికైన ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్కరించారు. ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



కల్లూరులో గుండం చుట్టూ అలావ్ తొక్కుతున్న భక్తులు



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

● భక్తిశ్రద్ధలతో జలధి

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి అగ్నిగుండం చుట్టూ ఊరేగించారు. అనంతరం గ్రామస్తులు డప్పు శబ్దాల మధ్య గుండం చుట్టూ అలావ్ తొక్కారు. తర్వాత పీర్లను చెరువులోకి ఊరేగింపుగా తీసికెళ్లి గంగస్నానం చేయించి భక్తులకు రొట్టెలను పంపిణీ చేశారు.

గుండెపోటుతో ఆలయ పూజారి మృతి

• దేహదానం చేసిన కుటుంబ సభ్యులు



నంజుండయ్య (ఫైల్)

హిందూపురం టౌన్: పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న బసవేశ్వర ఆలయంలో నాలుగు దశాబ్దాలుగా పూజారిగా పనిచేసిన జంగమ పీసీ నంజుండయ్య గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి దానం చేశారు. చెలికెరలోని ఆయుర్వేదిక్ కళాశాల బృందం మంగళవారం హిందూపురం వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు గురులింగయ్య, బసమ్మ, రత్నలు మాట్లాడుతూ నంజుండయ్య గతంలో పలుమార్లు తన స్నేహితులు, కుటుంబ సభ్యులతో చనిపోయాక దేహం మట్టిలో కలిసిపోవడం కన్నా అవయవదానాలు, దేహదానం చేయడం ద్వారా పలువురికి మేలు జరుగుతుందని చెప్పేవారన్నారు. ఆయన కోరిక మేరకు కళ్లను సేకరించి, దేహాన్ని ఆయుర్వేదిక్ కళాశాలకు అందించామని తెలిపారు. నంజుండయ్య మృతి విషయం తెలుసుకున్న వీరశైవ సంఘం అధ్యక్షుడు వీరభద్రప్ప, కోశాధికారి సంపత్‌కుమార్, డైరెక్టర్ రమేష్, తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

టీడీపీ జిల్లా స్థాయి సమావేశానికి స్పందన కరువు

మడకశిర: పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపంలో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నాయీ బ్రాహ్మణ సాధికార సమితి మహాసభ జరిగింది. సమావేశానికి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది నాయీ బ్రాహ్మణులు హాజరవుతారని టీడీపీ ముఖ్య నాయకులు భావించారు. అయితే తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. అలాగే పట్టణంలో నిర్వహించిన ర్యాలీ కూడా విజయవంతం కాలేదు. జిల్లా స్థాయి నాయకులు ఆశించిన స్థాయిలో ఈ సభ విజయవంతం కాకపోవడంతో తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. సభ నిర్వహించడంతో మడకశిర నాయకులు విఫలమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా స్థానిక టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఈరన్న కూడా ఈ సమావేశానికి హాజరు కాలేదు. మరోవైపు సోమవారం మడకశిర మండలం గౌడనహళ్లిలో టీడీపీ ఆధ్వర్యంలో మహాశక్తి చైతన్య రథయాత్ర ప్రారంభమైనా పెద్దగా స్పందన లేకపోవడంతో తమ్ముళ్లు నిరాశ గురయ్యారు.

దీపికకు సహకరిస్తాం



దీపికను సన్మానిస్తున్న రాష్ట్ర కురువ సంఘం నాయకులు

హిందూపురం టౌన్: హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమితులైన కురుబ సామాజిక వర్గానికి చెందిన దీపికకు సహాయ సహకారాలు అందిస్తామని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వారు మాట్లాడుతూ హిందూపురం రాజకీయ చరిత్రలో మొదటిసారి ఒక మహిళకు అవకాశం కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివ, నాయకులు మహేష్‌గౌడ్, సంఘం నాయకులు కృష్ణ గౌడ్, రామకృష్ణప్ప, క్రిష్టప్ప, హరి, మోతుకుపల్లి సోము తదితరులు పాల్గొన్నారు.



శాకాంబరీగా వాసవీమాత

చిలమత్తూరు: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారు శాకాంబరీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

గుడిబండ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గుడిబండ సర్పంచ్ కరుణాకర్‌గౌడు పేర్కొన్నారు. సోమవారం గుడిబండ సర్పంచ్ ఆధ్వర్యంలో అవిన్యూ ప్లాంటేషన్ ద్వారా దాదాపు 6000 మొక్కలు నాటారు. గుడిబండ నుంచి ఫళారం వరకు, అలాగే గుడిబండ నుండి మద్దనకుంట క్రాస్ వరకు, గుడిబండ నుండి చిగతుర్పి వరకు , గుడిబండ నుండి జవనడుకు క్రాస్ వరకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో శశిధర్, ఎల్.కె.నరసింహప్ప, టీఏ శ్రీనివాసులు, ఎఫ్ఏ మంజునాథ్, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

రొళ్ల: గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సుత్రాలు పాటించే విధంగా ఆశ వర్కర్లు అవగాహన కల్పించాలని పీహెచ్‌ఎన్ సుధారాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కమ్యూనిటి హెల్త్ సెంటర్ ఆవరణలో ఆశ వర్కర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎన్ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు, సూచనాలు పాటించే విధంగా చూడాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ ఖాదర్‌వలీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మీ పాహిమాం




తలపై అంబలితో మహిళా భక్తులు , అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మి

హిందూపురం టౌన్: పట్టణంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ అమ్మవారికి మంగళవారం అధిక శ్రావణమాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. కృష్ణభజన మండలి ఆధ్వర్యంలో సహస్ర నవరత్న అర్చన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కరిమారెమ్మకు అంబలి సమర్పణ

స్థానిక మోడల్‌కాలనీలోని ఓంశక్తి కరిమారెమ్మకు మంగళవారం ఓం శక్తి మాలధరించిన మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మాలధారులు నిష్ఠతో అంబలిని తలపై మోసుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు.

ఎంఐఎం నాయకుడి మృతికి నివాళి

హిందూపురం: మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా సోదరుడు, ఎంఐఎం పార్టీ నాయకులు నిసార్ సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి మృతుడి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక సంతాపం తెలిపారు. మాజీ ముతవల్లి ఖలీముల్లా, కౌన్సిలర్ ఆసీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మార్కెట్ చాంద్, సాధిక్, అన్సర్ హుసేన్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా

హిందూపురం టౌన్: ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేని ఓటరు జాబితాను రూపొందిస్తామని తహసీల్దార్ హసీనా సుల్తానా, కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

పరిగి: తప్పులు లేని ఓటరు జాబితా తయారీనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని తహసీల్దారు సౌజన్యలక్ష్మీ తెలిపారు. పరిగిలోని పీఎస్ నెంబర్ 60లో ఇంటింటా ఓటరు సర్వేపై బీఎల్వోలు చేపడుతున్న కార్యక్రమాన్ని మంగళవారం తహసీల్దారు పర్యవేక్షించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని చంద్రగిరి, గొల్లపల్లి గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దుద్దేబండ పంచాయతీ సర్పంచ్ గౌతమి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు–1 గ్రామ పంచాయతీలో వడ్రహట్టి, పీ.ఎన్.పాళ్యం గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ జగదాంబ తెలిపారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి



విద్యార్థులను అభినందించి మెమొంటోలు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ప్రతి విద్యార్థి ఓ మంచి శాస్త్రవేత్తగా ఎదిగేలా ప్రయత్నించాలని ఎంఈఓ గంగప్ప అన్నారు. మంగళవారం స్థానిక చైతన్య పాఠశాల నుంచి నాసా కంటెస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన విద్యార్థులకు మెమొంటోలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఏఓ ప్రభాకర్‌రెడ్డి, డీన్ నాగరాజు, నాసా కోఆర్డినేటర్ నాగరాజు, పీఈటీ మారుతి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీతో రాగి విత్తనాలు

చిలమత్తూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రాగి సాగుచేసుకునే రైతాంగానికి 50 శాతం సబ్సిడీతో రాగి విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారి వంశీకృష్ణ తెలిపారు. 4 కేజీల ఇంద్రావతి రకం విత్తనాలు సబ్సిడీ పోను రూ.139 చెల్లించి పొందవచ్చన్నారు.

ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి



డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ నరేంద్ర

పరిగి: వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు విధిగా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. మంగళవారం సాయంత్రం ధనాపురం వద్ద వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

కార్మికుల నిరసన

హిందూపురం టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక ఇందిరా పార్కు నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ కార్యాలయం గేటు వద్ద బైఠాయించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.